# సాక్షి కాకినాడ


ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023






## ఆలయ నిర్మాణానికి విరాళం


పి.గన్నవరం: ముంగండలో ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి నన్నయ విశ్వ విద్యాలయ లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు, మహిత దంపతులు శనివారం రూ.1,16,000 విరాళాన్ని అందజేశారు.



## 20 నుంచి క్లోజర్

గోదావరి డెల్టా ప్రధాన పంట కాలువలను మూసివేసే (క్లోజర్) సమయం ఆసన్నమైంది. ఈ నెల 20 నుంచి కాలువలు మూసివేయాలని ఇరిగేషన్ అధికారులు నిర్ణయించారు. - 8లో▸

## డెల్టాలకు నీరు విడుదల




ధవళేశ్వరం: బ్యారేజి నుంచి శనివారం తూర్పు డెల్టాకు 1400, మధ్య డెల్టాకు 450 ,పశ్చిమ డెల్టాకు 3000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద 4.50 అడుగులకు నీటి మట్టం చేరింది.

**కాకినాడ**

| ఇఫ్తార్ | - | సెహరీ |
| --- | --- | --- |
| ఆదివారం (సా) | | సోమవారం (ఉ) |
| 6:28 | - | 4:23 |

## రంజాన్ వేళలు




# వెన్నెల్లో గోదారి అందం

నా జీవితంలో పహాడీ రాగం వాయించింది సితార.. మాసిపోయిన నా ముఖాన్ని వెన్నెల నీళ్లతో కడిగింది సితార. అరిగిపోయిన నా కాళ్లకు బూరుగుపూడి దూది చెప్పులను తొడిగింది సితార.

సితార సినిమా దర్శకుడు వంశీ అన్న మాటలివి. ఆయనపై ఈ సినిమా ఎంత ప్రభావం చూపిందో చెప్పకనే చెప్పారు. ఆయన్నేనా.. తెలుగు ప్రేక్షకులందరి గుండెల్లో సితార ఆనంద లయలు పలికించింది.. మూడు పదులు కూడా నిండక మునుపే వంశీ తీసిన ఈ చిత్రం క్లాసికల్ హిట్‌గా నిలిచింది. విడుదలై 40వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంలో సితార వెనకున్న గోదావరి సంగతులను ఓసారి మననం చేసుకుందాం

– రాజమహేంద్రవరం డెస్క్




సినీ దర్శకుడు వంశీ పేరు వింటే వెంటనే గుర్తుకొచ్చేది గోదావరి. అంతేకాదు గోదావరి జిల్లా భాష.. యాస.. జీవన విధానం అడుగడుగునా ఆయన చిత్రాల్లో కనిపిస్తూ ఈ జిల్లా వాసుల హృదయాల్లో గిలిగింతలు పెడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే వంశీ సినిమా చూస్తున్నంతసేపూ గోదావరి పల్లెల్లో కలియతిరుగుతున్నట్టే అనిపిస్తుంది. వంశీ దర్శకత్వంలో తెరకెక్కిన అన్ని సినిమాల్లాగే సితారతోనూ గోదావరి జిల్లాకు అనుబంధముంది. బిక్కవోలు మండలం బలభద్రపురంలో పుట్టినా రాయవరం మండలం పసలపూడిలోనే సాగింది ఈ సృజన దర్శకుడి బాల్యం. చిన్నప్పటి నుంచీ రచనలపై ఆసక్తి పెంచుకుని ఆ దిశగానే అడుగులేశారు. 15 ఏళ్లకే ఆయన రచనలు పత్రికల్లో ప్రచురితమయ్యేవి. అలా రాసుకున్నదే 'మహల్లో కోకిల' నవల. ఈ నవల ఆధారంగా తీసిందే సితార చిత్రం. మంచుపల్లకి తర్వాత ఆయన దర్శకత్వంలో వెలువడిన రెండో చిత్రమిది.

### కళా 'పూర్ణోదయ'ం

గోదావరి సీమకే చెందిన ఏడిద నాగేశ్వరరావు పూర్ణోదయా క్రియేషన్స్‌పై సితార సినిమా రూపుదిద్దుకుంది. ఈ బ్యానర్ అంటేనే ఓ ప్రత్యేకత. కళలకు, కథలకు పెద్దపీట వేస్తుందని ఈ బ్యానర్‌కు పేరు. తెలుగు చలన చిత్ర రంగం ఎప్పటికీ మరచిపోలేని శంకరాభరణం వంటి చిత్రాభరణాన్ని అందించిన పూర్ణోదయాలో 24 సంవత్సరాల వయసులోనే వంశీ తన 'మహల్లో కోకిల' కథను ఏడిద నాగేశ్వరరావుకు వినిపించారు. కథ పూర్తిగా విని సినిమా తీయడానికి ఆయన ఒప్పుకున్నారు. పూర్ణోదయాకు స, శ అక్షరాలతో వచ్చేలా సినిమా పేరు పెట్టి తీసే సెంటిమెంటుంది. అలా పెట్టిన పేరే సితార.

### మన మంగభానే.. భానుప్రియ

సితార సినిమాకు అనుకోకుండానే ఆయన అమితంగా ఇష్టపడే సొంత జిల్లా గోదావరి మూలాలున్న భానుప్రియను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. ఈమె కుటుంబం రంగంపేట మండలంలో కొన్నాళ్లు ఉంది. అసలు పేరు మంగభాను. తర్వాత చెన్నై వెళ్లిపోయారు. తమిళంలో అప్పటికే ఒక సినిమాలో నటించిన భానుప్రియ ఈ చిత్రం ద్వారా తెరంగేట్రం చేసింది. ఆమె కళ్లను ఈ సినిమాలో ఎంవీ రఘు ప్రత్యేకంగా ఫోకస్ చేశారు. ఇక్కడో సంగతి. పూర్ణోదయ బ్యానర్ చిత్రం అనగానే విశ్వనాథ్ దర్శకుడని భానుప్రియ భావించారు. కుర్రాడిలా కనిపించిన వంశీయే చిత్ర దర్శకుడని తెలుసుకుని ఆశ్చర్యపోయారని చెబుతారు.

### వెన్నెల్లో గోదారి అందం

సితార ఈ సినిమా ప్రధాన లొకేషన్ వెంకటగిరి కోట అయినప్పటికీ.. చాలా సన్నివేశాలు గోదావరి పరిసరాల్లోనే తీశారని ఈ సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన వెంకట్ మద్దిరాల చెప్పారు. హీరో సుమన్‌ను చీకట్లో వెంటాడే సన్నివేశం దేవీపట్నం మండలంలో గోదావరి గట్టు వద్ద చిత్రీకరించారు. దేవీపట్నంతో పాటు గూటాల వీధులు, రాజమహేంద్రవరంలోని హుకుంపేట తదితర ప్రాంతాలు ఈ సినిమాలో కనిపిస్తాయి. అన్నింటికన్నా ప్రధానం గోదావరి. 'వెన్నెల్లో గోదారి అందం' అంటూ జానకి పాడిన పాటను చిత్రీకరించిన తీరు మనసును దోచుకుంటుంది. ఈ పాట గానకోకిలకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చింది. కేంద్రం ప్రకటించించిన జాతీయ అవార్డుకు ఉత్తమ గాయనిగా జానకి ఎంపికైంది. సితార ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపికై మరో అవార్డును సొంతం చేసుకుంది. ఇదే సినిమాలో ఎడిటింగ్ విభాగంలో అనిల్ మల్నాడ్ బెస్ట్ ఎడిటర్‌గా ఎంపికయ్యారు. ఇలా మూడు జాతీయ అవార్డులను సితార కైవసం చేసుకుంది.

**ఇళయరాజా బాణీలు :** వంశీకి గోదావరి అంటే చాలా ఇష్టం. అన్ని సినిమాలూ గోదావరి నేపథ్యంగానే సాగుతాయి. ఆఖరుకు సంభాషణల్లో కూడా ఇక్కడ నేటివిటీ కనిపిస్తుంది. ఈ సినిమాలోని ఒక సన్నివేశంలో భానుప్రియ, సుమన్‌లు తీర్థంలో తిరుగుతుంటే ఓ వ్యాపారి జామకాయ చూపిస్తూ.. 'కడియం కాయండి.. ఆయ్' అంటాడు. సితార సినిమాకు జిల్లాలోని ఎక్కువ ప్రాంతాలను లొకేషన్లుగా ఎంపిక చేశారు. ఈ సినిమాలో 'వెన్నెల్లో గోదారి అందం'తో పాటు 'కిన్నెరసాని వచ్చిందమ్మా' పాట కూడా గోదావరి పరిసరాల్లో చిత్రీకరించిందే. పాటలన్నీ సూపర్ హిట్. ఇళయరాజాతో ఈయనకు మంచి సంబంధాలున్నాయి. అందువల్ల ఇళయరాజా మంచి ట్యూన్లు ఈయన చిత్రాల్లో ఎక్కువగా ఉంటాయి. అలాగే ఫొటోగ్రఫీ అంటే ఆసక్తి ఉన్న వంశీకి సితార ఫొటోగ్రఫీ సారథి ఎంవీ రఘు కూడా కలిసొచ్చిన అంశమే. రాజమహేంద్రవరానికి చెందిన జిత్‌మోహన్ మిత్రాతో పాటు మరికొందరు చిత్రంలో చిన్నచిన్న వేషాలు వేశారు. సీతాకోకచిలుకలో బాలనటుడిగా రాణించిన ఆలీ కూడా సితారలో ఒకచోట మెరుస్తాడు. ఇలా ఎన్నో గోదావరి విశేషాలు సితారలో 'వెన్నెల్లో గోదారి'లా ఎప్పటికీ గుండెల్లో ఆనందానుభూతిని పంచుతూనే ఉంటాయి.



### వంశీతో తొలి సినిమా



సీతాకోకచిలుక సినిమాకు వంశీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. అదే సమయంలో నేను పూర్ణోదయా సంస్థలో తిరిగేవాడిని. అప్పుడే కొంత పరిచయం ఆయనతో. 1984లో సితార సినిమాకు ఆయన దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసే తొలి అవకాశం వచ్చింది. ఒక విధంగా చెప్పాలంటే నాకు గుర్తింపు తెచ్చిన చిత్రమిది. కథ కోసం ప్రధాన లొకేషన్‌గా వెంకటగిరి కోటను ఎంపిక చేశారు. కానీ చాలా సన్నివేశాలు ఆయనకు ఇష్టమైన గోదావరి పరిసరాల్లో తీసినవే. స్థానికంగా చేసినప్పుడు లొకేషన్లు కానీ ఆర్టిస్టుల ఎంపిక గురించి కానీ ఆయనకు ఎవరూ చెప్పనక్కరలేదు. **– వెంకట్ మద్దిరాల**, అసిస్టెంట్ డైరెక్టర్

### ఇళయరాజాతో బంధం



గోదావరి జిల్లా అంటే వంశీకి అంతా ఇంతా ఇష్టం కాదు. ముఖ్యంగా తెలుగు వెండి తెరపై గోదావరిని ఆయన చూపించినంత అందంగా మరెవరూ చూపించలేరు. తన మనస్తత్వానికి సూట్ అయ్యేవారిని ఎంపిక చేసుకుంటారు. ముఖ్యంగా వంశీ చిత్రంలో ప్రత్యేకంగా చెప్పుకునేవి ఇళయరాజా పాటలు. వీరిద్దరి కెమిస్ట్రీ అలా కనెక్ట్ అయింది. అందుకే అంత బాగుంటాయి.

**– జిత్‌మోహన్‌మిత్రా**, రాజమహేంద్రవరం

## న్యూస్‌రీల్

### అమృత్ సరోవర్‌కు 40 చెరువులు ఎంపిక

డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి



తాళ్లూరు వెంకటరాయుడు చెరువులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ వెంకటలక్ష్మి

**గండేపల్లి:** గ్రామాల్లో నిరుపేద కార్మికుల జీవనోపాధి కోసమే ఉపాధి హామీ పనులు చేపడుతున్నట్టు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలోని తాళ్లూరు వెంకటరాయుడు చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు అమృత్ సరోవర్ పథకానికి జిల్లా వ్యాప్తంగా 40 చెరువులు ఎంపిక కాగా వాటిలో 25 చెరువుల్లో పనులు జరుగుతున్నట్టు చెప్పారు. దీనిలో భాగంగానే వెంకటరాయుడు చెరువును అభివృద్ధి చేస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా రెండు లక్షల పనిదినాలు పూర్తి చేశామన్నారు. గతేడాది కూలీలకు దినసరి వేతనం రూ.257 చెల్లించగా ప్రస్తుతం రూ.272 ఇస్తున్నట్టు చెప్పారు. ఏప్రిల్ నెలలో రోజుకు 92 వేల మంది పనికి వచ్చే విధంగా టార్గెట్ పెట్టుకున్నామన్నారు. ఉపాధి కూలీలు వడగాల్పుల నుంచి రక్షణ పొందేందుకు తలకు తలపాక చుట్టుకోవాలని, పంచదార, ఉప్పు కలిపిన నీటిని పని వద్దకు తెచ్చుకోవాలని, ప్రతిఒక్కరూ ఉదయం ఆరు గంటలకే వచ్చి పనులు ముగించుకుని పది గంటలకు ఇంటికి వెళ్లేపోవాలని సూచించారు. ఆమె వెంట ఉపాధి ఏపీఓ ఎన్.గంగాభవాని, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు, ఎంపీటీసీ చెల్లూరి రాంబాబు, సర్పంచ్ సీలామంతులు వీరబాబు తదితరులు ఉన్నారు.

### క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం

**నాగమల్లితోట జంక్షన్ :** జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్ఎంసీ క్రీడామైదానంలో ఎంఎస్ రవికుమార్ స్మారక క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. సంఘ సీఈఓ మోపూరి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. సంఘ అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఎంసీ క్రీడా మైదానంలో ఈనెల 17న అండర్-23 పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక చేస్తున్నట్టు సంఘ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఎంపికలకు ఆసక్తి గల వారు హాజరు కావాలని ఆయన కోరారు.

### అన్నవరం దేవస్థానం బడ్జెట్ 166.25 కోట్లు

**అన్నవరం:** స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను 166.25 కోట్ల వార్షిక బడ్జెట్‌కు దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆమోదం తెలిపారు. ఆ మేరకు దేవస్థానానికి శనివారం సమాచారం పంపించారు. ఇందులో రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విభాగాల ఉద్యోగుల జీతభత్యాలకు రూ.40.65 కోట్లు కేటాయించారు. వ్రత పురోహితుల పారితోషకాలకు రూ.17 కోట్లు, ప్రసాదం ప్యాకర్స్‌కు రూ.2.50 కోట్లు, కేశఖండనశాలలో నాయీబ్రాహ్మణులకు రూ.1.75 కోట్లు కేటాయించారు.

# వడివడిగా వరికోతలు

- ఆశాజనకంగా రబీ దిగుబడులు
- సాగు విస్తీర్ణం 1.62 లక్షల ఎకరాలు
- కలిసొచ్చిన ముందస్తు నీటి విడుదల

**బోట్‌క్లబ్ (కాకినాడసిటీ):** ప్రభుత్వం ముందస్తుగా నీరు విడుదల చేయడం, వాతావరణ అనుకూలించడంతో రైతన్నకు ఫలితం దక్కింది. ప్రస్తుత రబీ సీజన్‌లో అనుకున్న దానికన్నా వరి దిగుబడులు అధికంగా వస్తుండడంతో రైతులు ఆనందానికి అవధుల్లేవు. జిల్లాలో ఈ ఏడాది రబీలో లక్షా 62 వేల 500 ఎకరాల్లో వరి సాగుచేశారు. గత ఏడాది జూన్ మొదటి వారంలోనే సాగునీరు విడుదల చేయడంతో ఖరీఫ్ పనులు మొదలుపెట్టుకునే వీలుకలిగింది. దీనికి తోడు ప్రస్తుత ఖరీఫ్‌లో అనుకున్న సమయం కంటే సుమారు 20 రోజులు ముందుగానే 50 వేల ఎకరాల్లో వరినాట్లు వేశారు. సకాలంలో ఆర్బీకేల ద్వారా బొండాలు, ఎంటీయూ 1121, ఎంటీయూ 1156, ఓం సాయి, ఎంటీయూ 1224, ఆర్ఎస్ఆర్ 15048 , బీపీటి రకాల విత్తనాలు అందడం, నీరు అందడం, వరుణుడి కరుణతో పంట పుష్కలంగా పండింది. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభించడంతో రైతులు అనుకున్న దాని కన్నా 7 నుంచి 10 బస్తాల దిగుబడి పెరగడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**అంచనా దిగుబడి 4.8 లక్షల మెట్రిక్ టన్నులు..**

ఈ ఏడాది వ్యవసాయ అధికారులు 4.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఎకరాకు 38 నుంచి 42 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేయగా ప్రస్తుతం 43 నుంచి 48 బస్తాలుకు పైబడి సరాసరి దిగుబడి వస్తుందని అంచనా. సామర్లకోట, పెదపూడి, కొత్తపల్లి మండలాల్లో పంట కోత ప్రయోగాలు కూడా చేశారు. గ్రామ వ్యవసాయశాఖ సహాయకుల ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలు చేశారు. సరాసరి దిగుబడి అనుకున్న దాని కన్నా ప్రతి మండలంలోను ఎక్కువుగా ఉందని ఈ ప్రయోగాల ద్వారా నిర్ధారించారు.

**ప్రారంభమైన కోతలు..**

జిల్లాలో ఇప్పటి 2500 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. ప్రత్తిపాడు, గండేపల్లి, ఏలేశ్వరం, యు.కొత్తపల్లి, పెదపూడి, సామర్లకోట, కాజులూరు మండలాల్లో జోరుగా వరికోతలు సాగుతున్నాయి.



కాజులూరు మండలం కుయ్యేరు గ్రామంలో వరికోతలు కోస్తున్న దృశ్యం

**మూడో పంటకు సానుకూలం..**

ముందస్తు నీరు విడుదల చేయడంతో రైతులకు మూడో పంట వేసుకొనేందుకు ప్రస్తుతం వీలుంటుంది. ఇప్పటికే 25 వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. కోతలు పూర్తయిన ఆయకట్టులో అపరాలు సాగుచేసుకొనే వీలుంటుంది. దీంతో రైతులకు అదనపు ఆదాయం కూడా లభిస్తుంది.

### అంచనాకు మించి దిగుబడులు



ఈ ఏడాది అంచనాకు మించి దిగుబడులు వస్తున్నాయి. దాదాపు జిల్లాలోని అన్ని మండలాల్లోను వరి కోత ప్రయోగాలు చేస్తున్నాం. ప్రయోగాల్లో అనుకున్న దానికన్నా దిగుబడి బాగుంది. కోతలు పూర్తయిన గ్రామాల్లో అధిక దిగుబడి వస్తుండడంతో అన్నదాతకు అదనపు ఆదాయం సమకూరనుంది.

– ఎస్.విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖాధికారి

# జగనన్నే మా భవిష్యత్తుకు స్పందన భేష్

**వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు**



కాకినాడ రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు

**కాకినాడ రూరల్:** జిల్లాలో జగనన్నే మా భవిషత్తు కార్యక్రమం విస్తృతంగా జరుగుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడ రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. మా నమ్మకం నువ్వే జగన్ అని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి రోజూ మంచి స్పందన వస్తోందన్నారు. సంక్షేమ పథకాలు బాగున్నాయంటూ వస్తున్న మిస్డ్ కాల్స్ సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఈ స్పందన పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తూ ప్రజలకు చేరువయ్యారన్నారు. ఆయనపై నమ్మకం రోజురోజుకూ బలపడుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనుల గురించి కూడా తెలియజేస్తున్నామన్నారు. ప్రశ్నలకు సమాధాన తెలుసుకుంటూ సర్వే చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో హామీలను ఏ విధంగా నీరు గార్చారో జగనన్న సైన్యం ప్రజల్లోకి తీసుకు వెళుతుందన్నారు. వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు విస్తృతంగా పర్యటిస్తున్నారన్నారు. ప్రతి ఇంటి వద్ద అడిగి మరీ స్టిక్కర్లు గోడలకు అతికించుకుంటున్నారన్నారు. ఇప్పటికి 60శాతం కార్యక్రమం పూర్తయ్యిందన్నారు.మరో వారం రోజులు ఈ కార్యక్రమం జరుగుతుందని కన్నబాబు వివరించారు.

# రైతు సంతృప్తి చెందేలా ధాన్యం కొనుగోలు

**పౌరసరఫరాల కమిషనర్ అరుణ్‌కుమార్**



వివిధ శాఖల అధికారులతో రబీ ధాన్యం కొనుగోళ్లపై సమీక్షిస్తున్న వ్యవసాయశాఖ రాష్ట్ర కమిషనర్ అరుణ్‌కుమార్

**కాకినాడ సిటీ:** రైతు సంతృప్తి చెందేలా ధాన్యం సేకరించాలని పౌర సరఫరాల కమిషనర్ హెచ్ అరుణ్‌కుమార్ అధికారులకు సూచించారు. జిల్లాలో శనివారం ఆయన పర్యటించారు. సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియలతో సమావేశమయ్యారు. జేసీతో కలసి పౌరసరఫరాల సంస్థ, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, లీగల్ మెట్రాలజీ, రవాణా తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. రైతు భరోసా కేంద్రాలకు రైస్ మిల్లులు, వే బ్రిడ్జిల అనుసంధానం, కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలింపునకు అవసరమైన వాహనాలు, హమాలీలు, గోనె సంచులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మరో రెండు వారాల్లో కోతలు ఊపందుకోనున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. కనీస మద్దతు ధర చెల్లించడంతో పాటు మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేలా కృషి చేయాలన్నారు. గన్నీ వినియోగానికి, హమాలీలకు, రవాణాకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ ఖర్చులను రైతే భరిస్తే ఇందుకు సంబంధించిన ఛార్జీలను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. దీనిపై ఏమైనా ఫిర్యాదులుంటే 1902, 155251 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయొచ్చన్నారు. అవసరం మేరకు ఆర్బీకేలలో గన్నీలను అందుబాటులో ఉంచాలన్నారు. వాహనాలను ఆర్బీకేలతో మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. పౌరసరఫరాల సంస్థ మేనేజర్ డి పుష్పమణి, జిల్లా పౌరసరఫరాల అధికారి జి చాముండేశ్వరి, డీసీవో దుర్గాప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ అధికారి గాయత్రీదేవి, రవాణాశాఖ అధికారి వీవీ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ అరుణ్‌కుమార్ అధికారులతో కలిసి సామర్లకోట మండలం జి మేడపాడు పర్యటనకు బయలుదేరి వెళ్లారు.

## క్లుప్తంగా

### దళితుల మనోభావాలను దెబ్బ తీసిన లోకేష్


బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ

అమలాపురం టౌన్: దళితులు పీకిందేమీ లేదంటూ టీడీపీ నేత నారా లోకేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలు రాష్ట్రంలోని దళితుల మనోభావాలు, ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేలా ఉన్నాయని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. దళితులను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకుని లోకేష్‌పై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితులపై లోకేష్‌కు ఎంత మాత్రం అభిమానం, గౌరవం లేవనడానికి ఆయన అనుచిత వ్యాఖ్యలే అద్దం పడుతున్నాయని పేర్కొన్నారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని నాడు చంద్రబాబు అగౌరవంగా మాట్లాడితే.. ఇప్పుడు తండ్రి బాటలోనే లోకేష్ దళితల పట్ల చులకనగా మాట్లాడటం దారుణమని అన్నారు. మొత్తం మీద తెలుగుదేశం పార్టీ ఆది నుంచీ దళితుల మనోభావాలను దెబ్బ తీసేలా వ్యవహరిస్తోందని గుర్తు చేశారు. దళితులకు పదవులు, సంక్షేమం, హక్కుల విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, అందువల్లనే ఆయన ఎక్కడికి వెళ్లినా బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. దళితులను అడుగడుగునా అవమానపరుస్తున్న తండ్రీ కొడుకులు చంద్రబాబు, లోకేష్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని దళితులకు ఇజ్రాయిల్ సూచించారు.

### రైలు ఢీకొని యువకుడి మృతి

నిడదవోలు రూరల్: స్థానిక చినకాశీ రేవు సమీపాన రైలు ఢీకొని యువకుడు మృతి చెందాడు. తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై జి.హరిబాబు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన కాలగంటి వెంకన్న (18) నిడదవోలులోని అమ్మమ్మ గారి ఇంట్లో కొంత కాలంగా నివాసం ఉంటున్నాడు. కూలి పనులకు వెళ్లే వెంకన్న పని లేకపోవడంతో శనివారం ఉదయం కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తూ పట్టాలు దాటుతున్న వెంకన్నను నిడదవోలు నుంచి రాజమహేంద్రవరం వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.



# 20 నుంచి క్లోజర్

- 41 రోజుల పాటు గోదావరి డెల్టా కాలువల మూసివేత
- తిరిగి జూన్ 1న తెరిచే అవకాశం

సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టా ప్రధాన పంట కాలువలను మూసివేసే (క్లోజర్) సమయం ఆసన్నమైంది. ఈ నెల 20 నుంచి కాలువలు మూసివేయాలని ఇరిగేషన్ అధికారులు నిర్ణయించారు. తాగునీటి అవసరాలకు అభ్యర్థన వస్తే తప్ప కాలువలకు నీటి విడుదలను పెంచే అవకాశం లేదు.

### రబీలో 88.615 టీఎంసీల విడుదల

గోదావరి డెల్టా వ్యవస్థ తూర్పు, పశ్చిమ గోదావరితో పాటు కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఏలూరు జిల్లాల్లో విస్తరించిన విషయం తెలిసిందే. ఈ జిల్లాలకు తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాల ప్రధాన కాలువల ద్వారా సాగునీరందుతోంది. ప్రస్తుత రబీ సీజన్ గత ఏడాది నవంబరు 30న ఆరంభమైంది. నాటి నుంచి శనివారం వరకూ సుమారు 93.50 టీఎంసీల గోదావరి జలాలు ధవళేశ్వరం బ్యారేజీ వద్దకు చేరాయి. దీనిలో తూర్పు డెల్టా కాలువలకు 26.045 టీఎంసీలు, పశ్చిమ డెల్టాకు 46.134, మధ్య డెల్టాకు 16.436 టీఎంసీల చొప్పున మొత్తం 88.615 టీఎంసీల నీరు విడుదల చేశారు. మరో ఐదు రోజుల పాటు నీరు సరఫరా చేయనున్నందున మూడు డెల్టా కాలువలకు కలిపి మరో 2.10 టీఎంసీల నీరు అందనుంది.

ధవళేశ్వరం బ్యారేజీ వద్దకు శనివారం ఉదయం 4,651 క్యూసెక్కుల నీరు రాగా, ఇందులో సీలేరు నుంచి వచ్చింది 3,535 క్యూసెక్కులు కాగా, సహజ జలాలు 1,116 క్యూసెక్కులు ఉన్నాయి. తూర్పు డెల్టాకు 1,400, మధ్య డెల్టాకు 450, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున 4,850 క్యూసెక్కులు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది ముందస్తు ఖరీఫ్ సాగు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇది సత్ఫలితాలనివ్వడంతో ఈ ఏడాది కూడా జూన్ మొదటి వారంలో ఖరీఫ్ సాగు ఆరంభించే అవకాశముంది. ఇందుకోసం జూన్ 1న కాలువలకు నీరు విడుదల చేసే అవకాశముంది. ఈవిధంగా చూస్తే ఈ ఏడాది క్లోజర్ 41 రోజులు ఉంటుంది.


ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద మధ్య డెల్టా ప్రధాన పంట కాలువ హెడ్ స్లూయిజ్

### క్లోజర్‌లో ఆధునీకరణ పనులు

క్లోజర్ సమయంలో డెల్టా ఆధునీకరణకు కేటాయించిన నిధులతో పూడికతీత, మరమ్మతులు పనులు చేయడంతో పాటు, రిటైనింగ్ వాల్స్ నిర్మించనున్నారు. బడ్జెట్‌లో గోదావరి డెల్టాకు రూ.65.10 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో చేపట్టే పనులతో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు, కాలువలపై షట్టర్ల మరమ్మతులు, పూడికతీత పనులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా కేటాయించిన నిధులతో ఈ క్లోజర్‌లో పెద్ద ఎత్తున పనులు చేయనున్నారు.

### సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు నింపుకోవాలి



డెల్టా కాలువలను ఈ నెల 20 నుంచి మూసివేస్తాం. తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు నింపుకోవాలని ఇప్పటికే కోరాం. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారుల నుంచి అభ్యర్థన వస్తే ఒకటి రెండు రోజులు నీరు ఇచ్చే విషయం ఆలోచిస్తాం. క్లోజర్ సమయంలో కలెక్టర్ మంజూరు చేసిన నిధులతో పాటు వివిధ రకాల పనులు చేపట్టనున్నాం. – డి.రామ్‌గోపాల్, జలవనరుల శాఖ జిల్లా అధికారి

### వచ్చే నెల 13న జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వచ్చే నెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సునీత శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టులలో లోక్ అదాలత్‌లు నిర్వహిస్తామని వివరించారు. ఈ సందర్భంగా కోర్టుల్లో పెండింగ్ సివిల్ తగాదాలు, యాక్సిడెంట్, బ్యాంకు రాజీకి వీలున్న క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి తమ కేసులను ఆయా కోర్టుల్లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

# మృతదేహాలు లభ్యం


మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి వేణు



యువకుల మృతదేహాలు



- గల్లంతైన చోటే వెలికితీత
- ముగ్గురు యువకుల కుటుంబాల్లో తీరని విషాదం

కె.గంగవరం: కూళ్ల గ్రామం వద్ద గౌతమీ గోదావరి నదిలో శుక్రవారం గల్లంతైన ముగ్గురు యువకుల మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. పామర్రు గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సాయిరామ్ (24) తన పుట్టిన రోజు సందర్భంగా.. బంధువులైన మట్టపర్తి ఆనంద్ (32), కాకినాడ జిల్లా కరప మండలం వేళంగికి చెందిన పితాని రాజేంద్ర(25) తదితరులు గౌతమీ గోదావరి తీరానికి వెళ్లిన విషయం తెలిసిందే. అక్కడ నదిలో స్నానానికి దిగి సాయిరామ్, ఆనంద్, రాజేంద్ర గల్లంతైన సంగతి విదితమే. గత ఈతగాళ్ల సాయంతో శనివారం సాయంత్రం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకూ ఎస్సై కె.చిరంజీవి గాలింపు చర్యలు చేపట్టగా మూడు మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన ప్రాంతంలోనే ముగ్గురి మృతదేహాలూ పైకి తేలాయి. మృతదేహాలకు కె.గంగవరం పోలీసులు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం ఆనంద్ మృతదేహాన్ని బంధువులు పామర్రు గ్రామానికి తరలించారు. సాయిరామ్, పితాని రాజేంద్ర మృతదేహాలను వారి బంధువులు వేళంగి గ్రామానికి తీసుకువెళ్లారు. ఈ ముగ్గురూ ఎలాగోలా బతికుంటారనే చిన్న ఆశతో ఆ మూడు కుటుంబాలూ ఎదురు చూస్తున్నాయి. వారి మృతదేహాలు లభ్యం కావడంతో ఆ కుటుంబాల్లో తీరని విషాదం అలముకుంది. పుట్టిన రోజు నాడే సాయిరామ్ మృతి చెందడాన్ని తలచుకుని అతడి కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా విలపిస్తున్నారు. మృతదేహాలను వెలికితీయడంలో ఎంపీటీసీ సభ్యుడు పిల్లి దుర్గాప్రసాద్, బీసీ నాయకుడు పంపన సుబ్బారావు, సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసంశెట్టి సూరిబాబు సహాయ సహకారాలు అందించారు.


మృతదేహాలను ఒడ్డుకు చేరుస్తున్న దృశ్యం

**మంత్రి వేణు పరామర్శ**

రామచంద్రపురం: గౌతమీ గోదావరిలో గల్లంతై, మృతి చెందిన ముగ్గురు యువకుల కుటుంబ సభ్యులను రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద పరామర్శించారు. మృతదేహాలకు నివాళులర్పించారు. మృతుల కుటుంబీకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారిని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరభద్రుడు, సీఐ దుర్గారావు, తాలూకా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# కోనసీమ తిరుపతి.. భక్తజలధి


భక్తులతో పోటెత్తిన వెంకన్న ఆలయం

- వాడపల్లికి పోటెత్తిన భక్తులు
- వేంకటేశ్వరస్వామి దర్శనానికి బారులు
- రూ.21.28 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శనివారం భక్తజలధిగా మారింది. ఇక్కడ స్వయంభువుగా వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించేందుకు వేలాదిగా భక్తులు వెల్లువెత్తారు. వేకువజాము నుంచే వాడపల్లికి భక్తుల రాక మొదలైంది. చూస్తుండగానే ఇసుక వేసినా రాలని స్థాయిలో భక్తులు తరలివచ్చారు. కొంతమంది భక్తులు పావన గౌతమీ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు స్వామి వారిని భక్తిపారవశ్యంతో దర్శించుకున్నారు. తమను చల్లగా కాపాడాలని మనసారా వేడుకున్నారు. ప్రదక్షిణలు చేసే భక్తులకు ఎండ తగలకుండా, ఎండ వేడికి కాళ్లు కాలకుండా ఆలయంలో చలువ పందిళ్లు, కార్పెట్ ఏర్పాటు చేశారు. స్వామి వారు పూర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు, స్వామివారి నక్షత్రం శ్రవణం కావడంతో ఆలయాన్ని రంగురంగుల సుగంధభరిత పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్సై సీహెచ్ సుధాకర్ ఆధ్వర్యాన పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యాన పర్యవేక్షించారు. వివిధ సేవలు, విరాళాల రూపంలో స్వామి వారికి రూ.21,28,002 ఆదాయం సమకూరిందని ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.

## రత్నగిరి టోల్‌గేట్ వద్ద అలిపిరి తరహా తనిఖీలు

అన్నవరం: రత్నగిరి టోల్‌గేట్ వద్ద సత్యదేవుని సన్నిధికి వెళ్లే వాహనాలను శనివారం నుంచి విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. తిరుపతి అలిపిరి తరహాలో దేవస్థానం టోల్‌గేట్ వద్ద తనిఖీలు మరింత కఠినతరం చేయాలని ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించిన విషయం తెలిసిందే.

ఇందుకోసం విధి విధానాలు, నిబంధనలు విధించారు. దీని ప్రకారం రత్నగిరికి వెళ్లే, ఆటోలు, ఇతర వాహనాల్లో అన్యమత ప్రచార స్టిక్కర్లు, సిగరెట్, గుట్కా, మత్తు పానీయాలు, గంజాయి, గ్యాస్ సిలిండర్లు, వంట చెరకు, కుక్కర్లు, పోర్టబుల్ సౌండ్ బాక్సులు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను అనుమతించడం లేదు. సెక్యూరిటీ సిబ్బంది అన్ని వాహనాలనూ జాగ్రత్తగా తనిఖీ చేసిన తరువాతే రత్నగిరికి అనుమతిస్తున్నారు. అనుమానం వస్తే ప్రతి బ్యాగ్ కూడా తనిఖీ చేస్తున్నారు. ఆ తరువాతే టోల్‌ఫీజు వసూలు చేస్తున్నారు.

## కొబ్బరి గోడౌన్ దగ్ధం : రూ.58 లక్షల ఆస్తినష్టం

మామిడికుదురు: మండలంలోని పాశర్లపూడి బాడవలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో కొబ్బరి గోడౌన్ దగ్ధమైంది. ఈ ప్రమాదంలో గోడౌన్‌లో నిల్వ ఉంచిన 1.50 లక్షల కురిడీ కొబ్బరి కాయలు పూర్తిగా కాలిపోయాయి. వీటి విలువ రూ.20 లక్షలు ఉంటుందని బాధితుడు వేగి లక్ష్మీనారాయణ వాపోయారు. ఎగుమతికి సిద్ధంగా ఉన్న 50 టన్నుల కొబ్బరి ఈనెలు కూడా మంటల్లో కాలిపోయాయని, వీటి విలువ రూ.18 లక్షలు ఉంటుందన్నారు. అగ్నిప్రమాదంలో భవనంతో సహా మొత్తం రూ.58 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని అంచనా వేశారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే రాజోలు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ శనివారం పరిశీలించారు. బాధితుడి నుంచి వివరాలు సేకరించారు.